

కథ:

# తన్మయత

= శ్రీ వేలూరి శివరామశాస్త్రి =

[గతసంచిక తరువాయి]

౮

ఆ మఱునాఁటి ప్రొద్దున నారదుఁడు రహో దేవిని రచ్చసావడి కీడ్చెను. ఇరుగు పొరుగులవా రందఱును "మలయమాలి లేచి పోయె"నని చెప్పుకొనిరి. వారి యిరుగుపొరుగులవా రందఱును "మలయమాలికి పిచ్చి యెత్తిన" దని చెప్పుకొనిరి. కోమటివాడ యంతయు కోటీశ్వరునియింటికి వచ్చి పరామర్శ చేసిపోవుచుండెను.

విజయమాలిప్రాణములు ప్రాణములలో లేవు. గోరుచుట్టుపై రోఁకటిపోటువలె ఈజనఘోష యేమి? లోకులు మంచి కంజలి పట్టక చెట్టనిటులు చెవాకులు చేసికొందు రేమి?

"మలయమాలి లేచిపోయె" నను వార్త పామరులలో విషమువలె వ్యాపించెను. "తండ్రియే వెడలనడచె" నని ఒకగుం పనుకొనెను. "మలయమాలికి పిచ్చి యెత్తె" నని ఇంకొక గుం పనుకొనెను. "అది మదనోన్మాద"మని మఱియొక గుం పనుకొనెను. దానిమీఁద చిలవలు పలవలు వికసించెను. "మలయమాలిని బ్రహ్మచర్యమున బంధించుట తలిదండ్రులదే త" ప్పని మహాజనము తీర్పిచ్చెను.

ఈతీర్పుచే విజయమాలికి వగర్పు పుట్టెను. తాను కొడుకునకు పెండ్లి చేయననెనా? కొడుకు చిన్నవాఁడా చితకవాఁడా? చదివినవాఁడా చదువనివాఁడా? అతని కే వధువును నచ్చదు. తా నేమి చేయఁగలఁడు? ఈమాట లెవరు విందురు? లోకము మాయ మూఁకు దున్నదా? విజయమాలి తలుపులు మూసికొని మరణదండమును నిరీక్షించుచు మంచ మెక్కెను.

మలయమాలితల్లి గ్రామదేవతలకు మ్రొక్కుబడులు చెల్లింపఁ జనెను. అచటివారందఱు నామెను గాంచి "చేతులు కాలిన పిదప ఆకులు పట్టుకోడ మెందుకు? ఎన్నడూ లేంది ఇతర దేవుళ్లను—ఈబుద్ధుళ్లనూ ప్రబుద్ధుళ్లనూ కొలిస్తే బెడిసికొట్టదూ?" అని అనిరి. ఈవల కుమారునిమీఁది వాత్సల్యము, ఆవల రాజదండమువలని భయము! ఇటు చూచిన నూయియు, అటు చూచిన గోయియునుగా ఆమె ఏమియు మాటాడఁజాలక మ్రొక్కుబడులచటనే విడిచిపెట్టి యిలుదూఱి సిద్ధునంగడినుండి రావించి కుమారుని కనిపట్టియుండుటకుఁ దోఁటకుఁ బంపెను.

విజయమాలిగృహాంతరాళమున పగటి పూఁటనే రాత్రిదేవత కాఁపురము పెట్టెను. లక్ష్మీదేవి కలకలలాడుచుండఁగనే జ్యేష్ఠాదేవి సివాలాడఁజొచ్చెను.

"తలుపు."

"ఎవరు వారు ?"

"పలుకకువే పలుకకువే" యని విజయమాలి సన్నగా అనెను.

"నేను-రాజ్యలక్ష్మిని."

"అమ్మో! కొంప మునిఁగినది. నూయి యెక్కడనే?" యని విజయమాలి తడుములాడఁజొచ్చెను.

"తలుపు తీయవమ్మా."

"తీయకే. ఇం కేమున్నది ? బ్రతికి యుండఁగనే బండకొయ్యలో దుర్మరణము!"

"ఎందుకండీ అంత భయము ? పిల్లవానికి పిచ్చి యెత్తఁగా పైన ఈ పరియాచకమా ? మన మేమి తప్పు చేసితిమి ?" అని భార్య పోయి తలుపులు తెఱచెను. విజయమాలి రాజ్యలక్ష్మిని ముసుగులోనుండి చూచి గడగడలాడిపోయెను. రాజ్యలక్ష్మి "ఇవ్వేళ కొట్టు తీయలేదేం ?" అని చిఱునగవును పెదవులలోనే అడఁచిపట్టుకొనెను.

విజయమాలి గుండెలు పట్టుకొని "ఆహా! మలయమాలికి పిచ్చి." అని ఆవురుమని యేడ్చెను.

అతని భార్య - "మేము బిగ్గఱగా నేడ్చుటకుఁగూడ నోఁచుకొనలేదు. చూచితివా రాజ్యమూ! నాకుర్రవాఁ డందఱి కుర్రవాండ్ర వంటివాఁడు కాఁడు. నీ వెఱుఁగుదువు. వాఁడు బ్రాహ్మణులతోపాటు చదువుకొన్నవాఁడు; రాజులతోపాటు డబ్బుగలవాఁడు. ఇట్టి మా యేకైకపుత్రునకా యీ దురవస్థ? ముం దింక మాకర్మ మింకెంత యున్నదో" అని వలవల యేడ్చెను.

"ఈపిచ్చిని నేను మొదటినుంచీ గమనిస్తూనే వున్నాను. తీరా దగ్గరి కొచ్చేసరికి ఏమీ మాటాడలేకపోయేదాన్ని. బుద్ధదేవుణ్ణి తీసుకుని రాచకుమార్తగారిముంగలికేనాడు వచ్చాడో ఆనాడే ఈయనకీ పిచ్చనుకోండి." అని రాజ్యలక్ష్మి అనెను.

"ఆఁ. ఏమి టేమిటి ?"

"నాకును దెలియును. అతఁ డుద్రిక్తుఁడగుచుండినపుడెల్లనే నేదో మిషమీఁద వారించుచునే యుంటిని. వాఁడును నన్ను కంటగించుకొనుచునే యుండెను. నిన్నొక మాట యడుగుదును. ఈవార్త రాజకులములో తెలిసినదా ? నిక్కమాడినచో నీకు బహుమతి యిత్తు" నని విజయమాలి ప్రత్యుత్తరమున కెదురుచూచెను.

"రాచకులాని కేమిటయ్యా - రాచకు మార్తెగారికే తెలుసు. ఆమె వేణువనంలోకి దయచేస్తూవుంటే ఈయనగారు పచ్చడం పఱచడమూ, తీర్థ మాడబోతే పూలు విసరడమూను! ఆమె దేవత కాఁబట్టి పూరుకుంది. ఐతే, ఇవ్వాళటి పుకారునుబట్టి చూస్తే రాచకులం అనంగా ఏమిటి—పది పెట్టా పెడుతుంది; పది కొట్టా కొడుతుంది. అందులో ఇసుమంటి సాహసమా ? ఎంత అప్రతిష్ఠ! అమ్మో అమ్మో" అని రాజ్యలక్ష్మి గుండెలు బాఁదుకొనెను.

విజయమాలి మొగము తడిపాఁత యాయెను.

అతని భార్య రాజ్యలక్ష్మిచేతులు పట్టుకొని "నీ వడిగిన దిత్తును. మలయమాలికి నిజముగా పిచ్చి యెత్తిన దని రాజకుమారికి నీవు నచ్చఁజెప్పవలెను" అనెను.

"సరే. నే చెపతాగాని అబ్బాయిగారి వెర్రి ముందు కుదర్చండి."

"ఆలాగే. నీవు బహుమతి కోరుకో" అని విజయమాలి అనెను.

"లేని త్యాగికన్న ఉన్న లోభి మేలనడం ఇదే"నని లోపల ననుకొని, రాజ్యలక్ష్మి ఒక తారహారము మెడలో వేయించుకొని, సుగంధద్రవ్యములమాట మఱచి వెళ్లిపోయెను. విజయమాలియు వానిమాట మఱచి తలుపు మూసికొనెను.

మఱికొంత సేపటికి వీరలక్ష్మి వచ్చి తలుపు తట్టెను. ప్రాణములు బిగియఁబట్టుకొని విజయమాలి తలుపు తెఱచెను. వీరలక్ష్మి లోపలఁ బ్రవేశింపఁగనే అతఁడు మరలఁ దలుపు మూసివయిచెను.

"సరేకాని, మీ తండ్రిబిడ్డలకు ఆడవాళ్లను చెరబట్టడమేనా యేమిటి పని?"

విజయమాలి నాలుక కొఱుకుకొనెను.

"నే నుండఁగా అంత పని జరుగుటయే?" అనుచు విజయమాలిభార్య వారికడకు వచ్చెను.

"ఏమిటమ్మా నీకొడుకు తెలివి? నక్క యెక్కడ, నాకలోక మెక్కడ?" అని వీరలక్ష్మి యనెను.

"వెర్రికి వేయి విధా లని నీకు తెలియదటే ? మన కీ వాద మెందులకుఁగాని రాజకుమారికి కోపము రాకుండఁ జేయుదువేని నీకడుపునఁ బుట్టుదును."

"సరేకాని ఆయన ఆవరసగా 'ఇందుకీర్తి ఇందుకీర్తి' అని స్మరణ చేస్తూవుండగా ఎవరి మంచిమాట ఏం చెలామణీ ఔతుంది?"

"నీవుమాత్రము పిచ్చి యని చెప్పుము, చాలు. నీమాటకు అంత విలువ ఉన్న" దని విజయమాలి భార్యదెసఁ జూచెను. ఆమె తన మెడలోని కాసులపేరు తీసి వీరలక్ష్మి మెడలోఁ బడవైచెను.

వీరలక్ష్మి సంతసించి "ఈ పూఁట కొట్టు మూస్తిరాయె. ఎట్లా?" అని అడిగెను.

"ఔరా! మఱచితిని. నేను వచ్చి యిచ్చెద" నని విజయమాలి వీరలక్ష్మిని వెంటఁ బెట్టుకొని అంగడికిఁ బోయి వలసిన ద్రవ్యములిచ్చి దానినిఁ బంపివయిచెను.

కొంటెకోమటులు కొందఱు విజయమాలికడకు వచ్చి "మామా! నీవు రాజుగారి వియ్యంకుఁడవు, ఇఁక నీ కీ యంగడి యెందుల" కని వితగా నాతని నొవ్వనాడిరి.

మఱికొందఱు "శుద్ధబొద్ధుఁడ" వని దూయఁ బట్టుకొనిరి. కొందఱు "వెలివేయుదు" మని బెదరించిరి.

విజయమాలిగుండెలు రాలుగా మాఱెను. అతఁ డంగడి మూసి యిలు మోమాఱెను. దారిలో అల్లరిపిల్ల కాయలు "అడుగో రాజుగారి వియ్యంకుఁడు, రాజు.గారి వియ్యంకుఁడు" అని అఱవఁదొడఁగిరి. విజయమాలి చెవులు మూసికొని యింటికిఁ బరుగెత్తెను.

అతఁ డా పగలంతయు నెట్టులో గడపి రాత్రి మలయమాలిని ఉద్యానగృహమున బంధింపించి, తోఁటలోమాత్ర మతఁ డటు నిటు తిరుగుటకు వీలగునట్లు కట్టుదిట్టము చేసెను. ధన మంతయు నచటనచట నేలలో పాతిపెట్టెను. స్థిరాస్తి నంతయు వారి వీరిపేరఁ బెట్టెను.

విజయమాలి దాఁచమఱచిన రవ్వయో యన వేగుఁజుక్క పొటుక్కునఁ బొడిచెను. తూర్పుతలపొలమున ఉషాదేవి రవ్వల కొట్టు పెట్టెను.

విజయమాలి మోఁకాలుదిగని కొల్లాయ యొకటి కట్టుకొనెను. వాకిట గడ్డిపా న్పొకటి పఱచెను. దానిప్రక్కనే వంకరకఱ్ఱ యొకటి పెట్టుకొనెను. భార్యను బోసి చేసెను. వేలకన్నులు గల ఉత్తరీయ మొకటి కప్పుకొని ఆ దర్భశయన మలంకరించెను. భార్యను కాళ్లకాడఁ గూర్చుండు మనెను. ఊఁ రెగిరి పోవునటు లేడ్వు మనెను.

౯

వెఱ్ఱివానిని చూండ వేడుక. కావున నులయమాలితోఁట మనుజాకీర్ణ మాయెను.

మలయమాలి కా వనమే నందన వనము. ఆ యుద్యానకుటీరమే వైజయంతము. మలయమాలి కానందనమున స్వేచ్ఛగాఁ దిరుగాడ వీ లుండెను. ఐనను ఇపు డతఁ డా వైజయంతము దాఁటఁ దలఁచుకొనలేదు.

హంసపది యను దాది చాటుగా నాతనిఁ జూడఁబోయెను. మలయమాలి ధ్యానములో నుండెను. హంసపది కనుల నీరు పెట్టుకొని "కోటికి పడగెత్తిన కోమటి కొంటెబిడ్డవు. కన్న కడుపుకు చిచ్చుపెట్టావు. చిన్నప్పుడు నే నిచ్చిన పాలిల్లా వెఱ్ఱిపాలవుతా యని కలలో నయినా అనుకోలేదు నాయనా!" అని ఆక్రందించి వెళ్లలేక వెళ్లలేక వెళ్లిపోయెను.

బట్టుకవి బాలరాజు వచ్చి చూచి —

"బంగారువంటి కోమటి
సంగీతముచేత బేరసారము లుడిగెనూ"

అని దీర్ఘము తీసి వెళ్లెను.

కలకంఠి యను పేరు గల కలహాకంఠి యొకతె వచ్చి కొంచె మాచి చూచి నెటిక విఱిచి - "పిచ్చిట ? డబ్బుంటే సరి - అది లేకుంటే మదపిచ్చి" అని గద్దరించెను.

అలివేణి వచ్చి "పిచ్చికి మం దేమయినా వేస్తున్నారా?" అని అడిగెను.

"నీకూ పిచ్చి. ఆయన కేం పిచ్చే? మదపిచ్చికి మం దేమిటే? లొటిపిటశూలరోఁకళ్లకు గాని లొంగదు." అని కలకంఠి యనెను.

అలివేణి నోటికి గుడ్డ అడ్డముపెట్టుకొని కలకంఠిని చేబూని వెనుదిరిగెను.

మలయమాలిసహాధ్యాయుఁ డొకఁడు వచ్చి ఆకుటీరము ప్రదక్షిణించుచు —

"మా దిగుడు బావిలో నొక
చేద స్తపుహంస తపము చేసెడి; అది దా
మోదర నాభీకాసా
రోదితపద్మినినీఁదక్క నొల్లదు దేనిన్."

అని పఠించుచు వెడలిపోయెను.

ఇటులు గురువులును, సహాధ్యేతలును, మిత్రులును, బంధుగులును, పరిచితులును, పరిచారకులును వచ్చి చూచి నివ్వెఱను, కోపమును, దయను, విచారమును, అమర్షమును, విషాదమును పొంది యెవరి యిండ్లకు వారు వెడలిపోయిరి.

వెనుక రాజకుమారి యిచ్చిన యాజ్ఞ యిపుడు మంథరకున కర్థ మాయెను. అతని కలమును, కుంచెయు రాజకుమారిని పరివేషించెను. అతని హృదయ భ్రమర మామెరూప కుసుమ గుచ్ఛములోఁ దిరిగినకొలఁదియు నతనికలము మధుపూరిత మగుచువచ్చెను. అతని లోఁజూపునకు నమ్మిన బంటగు వెలిచూపు చూచినటులెల్ల నతని చేతిలోని కుంచె యాడెను. అతని మానస మామె రూపదేశమును ప్రదక్షిణించుచుండఁగా నతని కల మొక లావణ్యామృతమును పటకలశమున నింపెను. అతఁడంతరంగసముద్రమును మథించి తూలికాగ్రముచే రంగరించి అపూర్వమగు నొక నేత్రాలంకారమును పటాగ్రమునకుఁ దెచ్చి పొడవుగా నొక నిట్టూర్పు విడిచెను.

విజనముగా నున్నపుడు మలయమాలి యేమి చేయునో చూడఁదలఁచి కాఁబోలు సూర్యుఁడు నేలమీఁద మోము మోపి తన కిరణముల నా కుటీరములోనికిఁ బంపుచు, ఇటు మంథరకుని ప్రతిభను కొనియాడఁ గాఁబోలు తన కరములచే నొకతూరి ఆ చిత్తరువు నంటి దిగుచుకొనెను.

మంథరకుఁ డాచిత్తరువును చేలము చాటునఁ బెట్టుకొని మలయమాలికుటీరమునకుఁ గొంపోయెను. చూడవచ్చినవా రందఱును వెడలిపోయినతరువాత మసకమసక చీఁకటిలో మెలకువగా అడుగులు వేసికొనుచు పిల్లివలె నతఁడు లోని కేగి మలయమాలి కూరుచున్న కుటీరముచుట్టును దిరిగి లోపలను, వెలుపలను బరీక్షించిచూచెను. మలయమాలి మహాసమాధిలో నుండుట గనుఁగొని కుటీరములోని కడుగు దీసి యడుగు వెట్టుచుఁ జని యతని యెట్టెదుట నాచిత్తరువును నిలిపి యటనుండి దొంగవలె మెలమెలగా వెడలిపోయెను.

కృష్ణద్వితీయ ఆకాశమున మంచుదీప మెత్తెను. భూధేనువు నాక్రమించిన దోమలో యన చీఁకటులు పాఱిపోఁదొడఁగెను. కోటి కోటి వెలుఁగుగుత్తులతో కలకలలాడు నాకాశము మానవులకు వస్తుప్రదర్శనశాలయో యన భాసించెను. వెన్నెలపులుఁగులు వెంపరలాడెను.

అపుడు మలయమాలి కనులు దెఱచెను. అతఁ డెదుటఁ జూచి — "సహస్రబోధి జ్యోతులకు కేంద్రమయినది నీమోము. ఒకసారి నాకడకురమ్ము. ఈప్రదేశ మలంకరించి యెంతసే పయినది? ఆహా! ఎన్నాళ్లకు నాతపము ఫలించినది?" అని యెదురు చూచెను. కాని ఆ యిందుకీర్తి అతనికిఁ బ్రత్యుత్తర మీలేదు. దాన మలయమాలి కొంచెము వికలుఁ డాయెను.

అపుడు దక్షిణనాయిక మలయమాలిని జూచి నిట్టూర్చినదో యన మలయానిలము ప్రసరింపఁ దొడఁగెను. లతలు మలయానిలుని రాకకు సంతసించి తామై బిగ్గన కౌఁగిలి గొనుటచేతనో యన నెత్తావు లుబికి నాసికా పుటములకు తలమునక లాయెను. ఆచిత్ర పటము కొంచెము ముందుల కూఁగి గాలి కొల్లగొట్టుకొని వచ్చిన తావిని తనదిగాఁ జేసికొనెను.

మలయమాలి సంతోషభరితుఁడై - "నేను సింహళమునం దున్నపుడు బుద్ధుని త్రోవనుబట్టి సన్న్యాసదండమును చేఁబూని నిర్వాణనగరమునకు పోవఁ దలపోసికొంటిని. కాని యిందూ! నేను మొదట నిన్నుఁ జూచినపుడు నిర్వాణమునే చూచితిని. నేనపుడు నన్నే మఱచితిని. అది నిర్వాణము కాక మఱేమి?

"కాని తరువాతఁదరువాత ననుభూతి చేఁగాని తృప్తిచెందని కామక్షుధ నాప్రాణములలోఁ బ్రవేశించుట కనుఁగొంటిని. అగ్ని జ్వాల నాయింటి నాలుగుమూల లంటుకొనెను. కొందఱు దానిని రోగ మనిరి. మఱి కొందఱు వెర్రి యనిరి. సరకు మంచిది కాదని తెలుపుటకు లోకు లొక పాడుపేరు పెట్టి దానిని హింసింతురు. నా పని యటులే యయినది.

"తరువాత నే నా యగ్నిలో నాహుతి యగుదు ననుకొంటిని. కాని యటులు కాలేదు. నన్నది బూడిద చేయుటకుబదులు నాలోని మాలిన్యమును భస్మీకరించెను. ఇపుడు నాలో మహామైత్రి పదాఱువన్నె బంగారమై మెఱయుచున్నది. ఇందూ! ఇఁక రమ్ము. స్కంధపంచకము దాఁటి ఈ మైత్రీ భూమలో మునిఁగిపోవుదము." అని అనెను.

మలయవాయు వతని మాటల నాలకించుటకో యన నిలుచుటచే ఆప్రతికృతియు నిశ్చల మాయెను. మలయమాలి యిందుకీర్తి ప్రతివచనమునకు కనిపట్టుకొనియుండెను గాని వృథా.

మలయమాలి నపు డనుమానపిశాచ మావహించెను. "ఇది యిందుకీర్తి ప్రతికృతియా?"

అతఁడు కొంచెము దక్షిణమునకును, కొంచె ముత్తరమునకును వంగి చూచెను. ఆమె తనను చూచుచున్నటులు, కలకల నవ్వుచున్నటులు, మాటలాడఁ బోవుచున్నటులు, కదలుచున్నటులు అతనికిఁ గానిపించెను. అతఁ డెటు వంగి చూచినను ఆమె యతనినిఁ జూచుచునే యుండెను. ఈ దెస ఆ చిత్రపటము తన సృష్టికి సాఫల్యమును సంపాదించుకొనెను.

"ఇందుకీర్తి మౌనవ్రత మవలంబించెనా?" మలయమాలి మఱి యాఁగక యా చిత్రపటమును సమీపించెను. మీఁదఁ జేయి వైచినపిదపఁగాని యతని కది చిత్తరువని తెలియకపోయెను.

౧౦

"ఈచిత్తరు విచటి కెటులు వచ్చెను?"

ఈ ముడి అతనికి విడలేదు.

"ఇందుకీర్తియే పంపెనా?"

ఏమో. ఎటులో వచ్చెను. వచ్చెనుబోఁ జాలు. అది అతని భాగ్యము. మలయమాలి ఆ చిత్తరువును దెచ్చి యెదుట నిడి

కొని కూరుచుండెను. కొంతసేపు కన్నులఁ గాంచెను. కొంతసేపు మోమును దిలకించెను. కొంతసేపు కంఠమును కనుఁగొనెను. ఇటులు నఖశిఖాపర్యంతమును, శిఖానఖపర్యంతమును మరలమరలఁ గనుఁగొనెను. అతఁ డిటు లవలోకించుచుండఁగనే తెలవాఱెను.

అతఁ డాచిత్తరువుతోఁ బ్రసంగించును. తా నా చిత్తరువుమాటలు వినును. అతఁ డా చిత్తరువు నలంకరించును. తాను దాని తృప్త్యతృప్తుల గమనించును. అతఁడు వలయు వస్తువులఁ గనుఁగొనును. వానిని సమర్పించును.

అతని కిందుకీర్తితో ప్రణయకలహములు సంభవించెను. వెరవేఁకి జనించెను. సమసిపోయెను. అతఁ డిందుకీర్తిని బతిమాలెను. బతిమాలించుకొనెను. మాటలాడక కూరుచుండెను. మాటలాడెను. ఆమె బదులుమాటలు వినెను. ఈరీతిగా నతనికా చిత్తరువే యిందుకీర్తి యయిపోయెను.

అతని కిందుకీర్తికిఁగాను సత్యప్రపంచమునుండి కావలసిన వస్తువులు లేవు. సంకల్పముచే సృజింపఁబడిన వస్తువులే యామె కుపాహారములు. కాని ఒకానొకనాఁడు ఇందుకీర్తి నలంకరించుటకు చెట్లు పూచిన పూవులే మలయమాలికిఁ గావలసివచ్చెను. అంతట నామెతో వనవిహారము చేయు తలఁపు కలిగెను. అతఁడు వెంటనే యిందుకీర్తితో కుటీరము వీడి వనములోనికిఁ జనెను.

ఆ యుద్యానమున నున్న ఆ వృక్షస్తంభపర్యంత మిందుకీర్తికొఱకే మొలిచినటు లతనికిఁ గానిపించెను. అతడు కనఁబడిన చెట్టుక్రిందనెల్ల ఇందుకీర్తిని దింపి అచట నామె కుపచారములు చెప్పెను. అచట నొకొక్క పిట్టనే చూపెను. ఆ పిట్టకూఁత లిందుకీర్తిముం దొక గానసభగా నానందించెను.

ఇటులు వనవిహారము చేసిచేసి మలయమాలి యిందుకీర్తి నొక సురపొన్ననీడను డించి యామె నలంకరించుటకు పూవులు తేఁబోయెను.

రాజకుమారిచేఁ బ్రేరితుఁడై వినయజ్యోతి మలయమాలిని కనిపట్టియుండెను. మలయమాలి పూలకని అటు వెళ్లఁగనే వినయజ్యోతి యిటు వచ్చెను. అతఁ డా చిత్తరువును దీసి యావల నుంచి దానికి బదులుగా నచట మఱియొక చిత్తరువు నుంచి తా నొక చెట్టుచాటున దాఁగియుండెను.

ఈ చిత్తరువున బ్రహ్మండమైన ఒక నల్లత్రాఁచు. అది పడగ విప్పి యిందుకీర్తిని గాటువేసెను. ఇందుకీర్తి నేల కొఱగెను. ఆమె పెదవులును, దంతములును, మోమును నల్లఁబాఱెను.

మలయమాలి తోఁట యంతయుఁ దిరిగితిరిగి వసంతునిపంట యంతయుఁ గోసెను. ఆపటముముందులకు వచ్చి రంభాపలాశములఁ బఱచి వానిమీఁద నాపూలఁ గ్రుమ్మరించెను. పలుమాఱులు కోసికొనివచ్చిన ఆ పూలన్నియు నచట నుండఁగా అది యొక పూలయంగడి యాయెను.

ఆ పుష్పరాశినుండి దోసిళ్లకొలఁది పూలతో నతఁ డిందుకీర్తి నభిషేకింపఁదొడఁగెను. అవి ముత్తియములవలె నెగసి నక్షత్రములవలె నేల రాలెను. క్రింద రాలిన పూలన్నియు నొక పాలమడుఁ గాయెను.

పూలతావిచే నతఁ డున్మాదము చెందెను. ప్రేమచే నుడ్డుగుడుచుకొనెను. ఏకాంతతచే నితర మంతయు మఱచెను. అతఁ డిందుకీర్తిని కౌఁగిలించుకొనఁబోయి మోమెత్తి చూచెను. ఇందుకీర్తి చచ్చిపడియుండెను. ఆమె ప్రక్క బ్రహ్మాండమైన ఒక నల్లత్రాఁచు. అతని మేనిచర్మ మంతయు చలించెను. కనుల నీరు గ్రమ్మెను. అతఁ డెగదిగఁ జూచెను. అతని మతి చెదరెను. అతని కనులు ముకుళించెను. అతని యవయవములు పట్టుదప్పెను. అతఁ డెగురవయిచిన మట్టిముద్దవలె చదికిలఁబడెను. మూర్ఛలో మునిఁగెను.

మలయమారుత మాతని వదన మండలమందలి స్వేదబిందువులను తుడిచివైచెను. గరువముతో నిట్టనిలిచిన ఆ సురపొన్న పట్టని గోడు గామెను. మలయమాలి కొంతసేపటి కీప్రక్కనుండి యాప్రక్కకు దొరిలెను. మాఁగువాఱిన మోముతో లేచి యిందుకీర్తిని జూచెను. బాష్పప్రవాహ మతని నంధు నొనరించెను.

"ఇందుకీర్తి అస్తమింపఁగా, ఓరి మలయమాలీ! నీ జీవ మేల పోదు?" అని అతఁడు కనులు తుడుచుకొని రివ్వున నాసురపొన్న నెక్కఁదొడఁగెను.

దానిచాటుననే దాఁగియున్న వినయజ్యోతి రాఁబోవు నాపదను ఊహించి వెంటనే కొంతమంది భటులను సైగచే రావించి ఆయాపదను నివారించు ప్రయత్నమునం దుండెను.

మలయమాలి స్కంధము లన్నియు దాఁటెను. దిగంతమును జూచుటకుఁ బ్రయాణము కట్టినటు లున్న యొక కొమ్మ కతఁడు చేతులను, కాళ్లను లంకెవయిచి తలక్రిందుల పిట్టవలె వ్రేలాడి యిందుకీర్తిని ధ్యానించుచు చేతులను, కాళ్లను వదలివైచెను. అతఁ డాచెట్టునడుమ నేదేని కొమ్మమీఁదఁ బడి యుండునేని వేయిమలయమాలు లైపోయెడి వాఁడు.

మలయమాలి కనులఁ దెఱచి చూడఁగలిగినంతలో తాను వినయజ్యోతిచేతులలో బ్రతికియున్నటులు తెలిసికొనెను. మలయమాలి రిచ్చపడి యిటు లనెను: "అయ్యా, నా కుపకార మనుకొని అపకార మొనరించితిరి."

"ఎటులు?"

"ఇందుకీర్తి చనిపోయినపిదప నాబ్రతుకేల?"

"ఓయి మూఢుఁడా! నీవలెనే బ్రతికియున్న యిందుకీర్తిని చచ్చిన దనుచున్నావు. నీ వెవరిని పూలఁ బూజించుచుంటివో, నీ వెవరిని ముద్దాడుచుంటివో, నీ వెవరిని కౌఁగిలించుకొనుచుంటివో అది చిత్తరువు. నీవు రాగివి. ఇది యెల్లయుఁ గల్ల. ఇది నీ సంకల్పసృష్టి, భ్రాంతి, మాయ."

"ఇందుకీర్తి బ్రతికియుండుట కల్ల."

"ఓరి మూర్ఖుఁడా, అదిగో చూడుము, వేణువనమున బుద్ధుని విహారమును బరికించి తన ప్రాసాదమున కదె పోవుచున్నది."

మలయమాలి కరకంతలలోనుండి యిందు కీర్తిని జూచెను. వెంటనే యతనికి పూర్వస్మృతి కలిగెను. తల వంచుకొనెను.

"నాయనా, నీవు ధ్యానసిద్ధుఁడవు. నీ ధ్యానమును సిద్ధింపఁజేయుట కిందుకీర్తి

ఆచార్య. నీ వీధ్యానబలముచేఁ దత్త్వమును దెలిసికొనఁగోరుదువేని అమృతుఁడ వయ్యెదవే. పామరులు పైదలులకొఱకు శరీరము నైన నొడ్డుదురు. తత్త్వముకొఱకే శరీరము నొడ్డుదురేని మఱి శరీరము నెఱుఁగరుకదా. మనోబల ముపయోగించి నీ వెవరికొఱకు ప్రాణముల నొడ్డితివో ఆమనోబలమునే యుపయోగించి తత్త్వముకొఱ కిపుడు ప్రాణముల నొడ్డఁగలవేని కోటికోటి యిందుకీర్తుల మూలమును కనుఁగొనఁజాలుదువే” అని వినయజ్యోతి యనెను.

“ఏమేమి?” అని మలయమాలి డిల్లపడెను. అతని కనుబొమ లుత్కోచము లాయెను. ఒడలు కఱ్ఱబాఱెను. కొంచెము సేపటిలో నతని మోము పిండిన వలువయై వెంటనే సగము విఱిగి వ్రేలాడు నాకువలె నేలకు వ్రాలెను. కనులు నీటిముద్ద లయిపోయెను. అతని మానస మేకాగ్రతచే కరడుగట్టెను. ఇంతవఱకును శిశువువలె వినయజ్యోతిచేతులలో నున్న మలయమాలి యిపుడు లేచి అతనిముందు శిష్యునివలె నిలువఁబడి “కుండచిల్లిని బంగారపుపాడిచే పూఁడ్చుచుంటిని” అని వినయజ్యోతిముందు మోఁకారించెను.

“త్రిశరణములు నిన్ను రక్షించుఁగాక.”

౧౧

తలిదండ్రులు మలయమాలి పునర్జన్మ మెత్తినటులు సంతసించిరి. గురువులు “చదువుల కిది ఫల”మని తృప్తి ననిరి. “కుఱ్ఱవాని తిక్క తిరిగిన” దని ప్రజ శాంతి పొందెను. మిత్రు లందఱును ప్రత్యక్షమయిన దైవమును స్తోత్రముచేసినటులు ఇందుకీర్తియాచార్యమును స్తోత్రముచేసిరి. ఇందుకీర్తి వినయజ్యోతిని ప్రశంసించి మలయమాలికి మంగళము కలుగవలయు నని మనసులో కోరుకొనెను.



మలయమాలి యిటు లందఱను సంతోషసముద్రమున ముంచి మాయ మయిపోయెను.

ప్రేమను పాథేయముగాఁ గొని మనీష మలయమాలికొఱకు గృహత్యాగ మొనరించెను.

మనీష కాలువెట్టిన మొదటి యూరిసందులో నొక యింటిముంగల సందడిగానుండెను. ఆ యి ల్లొక మంగలవానిది. అతఁడు తాగి కొంచెము మత్తుగానుండెను. ఆ యింటియెదుటి వేఁపక్రింద దారిసరికట్టి పలువు రొక గుంపుగా కూర్చుండిరి. ఆ గుంపులో నొకఁడు “ఒరేయ్, తల తడిపిపోయావ్, తొందరగా రా” అనెను. ఇంకొకఁడు-“ఒరే నాకు సగం గొఱిగిపోయావ్; నీవాకిలే తిరుపతి చేశావ్” అనెను. “ఈవేళ యెవరి అదృష్టమూ తిన్నగా లే’’ దని ఒకఁడనెను. ఇటు లందఱు నిన్నిమాట లనుచుండఁగా ఆమంగలవాఁడు-“కోటీస్సరుడికొడుకు నిన్న సాగరం చేపించుకోని ఇదుగో! ఈ బంగార మ్మొలతా డిచ్చిపోయిండు. నీవుకూడా తే ఓ తాడు. నీకూ చేత్తా నున్నగా సాగరం” అని యనెను.

మనీష యీ మాటలు వినుచు వారిని తప్పించుకొని వెళ్లి ఊరబసివి కతిథియాయెను.

ఆ పగ లంతయు నామె రాత్రివలె వెడలఁబుచ్చెను. గూండ్లకుఁ జేరు పిట్టల

కలకలారావములు ఆమెస్వప్న సేతువును శిథిలమొనరించెను. పడమటికొండమీఁది సూర్యుని చరమకాంతి ఆమెమనసుమీఁద రక్తాక్షరముల ముద్రించిపోయెను.

మనీష యపుడు ఆ మంగలవాని యింటికేగి పది దీనారములచే నాతని ఆశ్చర్యమునముంచి మలయమాలికేశపాశమును గొని మిశనతీర్థమునకు మహాప్రస్థాన మొనరించెను.

మనీష గ్రామసీమ దాఁటి దానిని దీసి చూచెను. చంచలమయినను నిబిడమయిన యొక మదిరానుభవ మామెమానసమును స్పృశించిపోయెను. ముఖరమైపోటు పొడిచిన మున్నీటి ముత్తరఁగతలపై పుష్పించిన బుద్బుదమై, గిరుసఁ దిరుగు మహాకాలుని రథచక్రమునుండి తునిసిపడిన మణిదీప్తియై మలయమాలి యామె కా కేశపాశమునఁ గనఁబడెను. ఆమె దానిని ముద్దిడుకొని కనుల కద్దుకొని తన కేశపాశములో కలిపి చుట్టుకొనెను. కృష్ణరాత్రి వక్షస్స్థలమును భేదించుకొని వచ్చిన రోమాంచమో యన నున్న నక్షత్రముల వెలుఁగులో "ఇటు పో, ఇటు పో" అని చెప్పి చూపుచున్న భూదేవితర్జనిఁబోలు బాటఁబడి యామె తెలవాఱులును నడచెను. ఊషాదేవి కావిచీరలతో నామె కెదురాయెను. సంసారభారముచే క్రుంగిన ప్రకృతిమాత బిడ్డలు చెట్టుచేమలు అయత్నపాలితములైనను ఆమె గుప్తవాత్సల్యమును పొందియోయన ఛాయాతపముల నిత్యక్రీడలో పాలుగొని అడ్డదిడ్డముగా తెగఁబెఱిఁగి ఆకసముదెస దేనినో చూచుచు నామెకుఁ గనఁబడెను. వానిని దాఁటినతరువాత ఎత్తయిన మేడలు. మిద్దెలు. నాలుగిండ్ల బవంతులు. రాజవీథులు.

మనీష ఆ నగరపు రచ్చచావడిముందునుండి చనుచు నచట వెనుకటి విటులను జూచి తల వంచుకొనెను. ఒకానొకపుడు పూలవలె తనమీఁదఁ బడిన వేనవేల చూపు లిపుడు ముండ్లవలె నామెకు గ్రుచ్చుకొనెను. ఒకానొకపుడు విషమే యమృత మగును. మఱియొకానొకపుడు అమృతమే విషమగును.

ఆమె యున్న యా యునికికిని, ఆ రాకకును అచటివా రందఱును ఆశ్చర్యపడిరి. ఒకరొకరే యామెకు స్వాగత మిడిరి. అది యటుండ ఏలికయే రమ్మని ఆమెకు వార్త పంపెను. కాని మనీష యేటియొడ్డున నొక చెట్టున కతిథి యాయెను. ఏలయన, అది సరసము లాడఁబోదు; తనదారి కడ్డురాదు.

ఆమె యానాఁ డచట నాఁడుదాని యసహాయతను, విశేషించి గణికల దుర్గతిని, మగవాని ప్రాబల్యమును, విశేషించి రాజుల యత్యాచారమును లెస్సగాఁ దెలిసికొని తన తెలివితేటలచే కామవైతరణిని దాఁటి తన రూపసంపదను నిందించుకొనుచు మరల భూషించుకొనుచు మధురకుఁ జనెను. ఆమె యచటఁగల విహారమునఁ బ్రవేశము సంపాదించెను. అందు ధర్మభగిని యాయెను. కాని యామె యెందుల కచటఁ బ్రవేశించెనో దానికి ఇసుమంతయు ఫలము కానరాలేదు.

ఆమె కచటఁ దాను చేయుచున్న పని తనకే విపరీతముగాఁ బొడగట్టెను. మఱియు తాను తిరిపె మెత్తుకొని తిని యిడుములు గుడుచుచున్నను తన సౌందర్యభాండారమునకు పెంపేకాని టొం పేడను కానఁబడుట లేదు. విహారమున తాను ధర్మభగినిగానున్నను పురుషసంఘమునుండి యామెకు

నిర్భయత లేదు. ఆఁడుదానికి స్వేచ్ఛగా బ్రతుకుటకు వీలే లేదా ?

ఆమె యిటులు సముద్రమున తెప్పవలె నటు నిటు కొట్టుకొనుచుండఁగా బౌద్ధ సన్న్యాసుల మారజయోత్సవము వచ్చెను. వెనుక నొకానొకనాఁడు బుద్ధుఁడు కామ క్రోధాదులకు నెలవగు మారుని జయించెను. దాని కీ పండువు గుర్తు.

శ్రమణు లందఱును ముండనము చేయించుకొనిరి. ఆఱవయిచిన కావివలువలఁ దాల్చిరి. త్రిశరణములకు శరణు జొచ్చిరి. పిమ్మటఁ గామాదిదుర్గణములను చిత్రించి ఆచిత్తరువులను దెచ్చి ఒకటొకటీ తగులఁబెట్టిరి.

అటుపిమ్మట "సర్వం దుఃఖం దుఃఖ" మ్మనియు, "సర్వం శూన్యం శూన్య" మ్మనియు దిక్కులు మాఱుమ్రోఁగెను.

ఈ భావనామంత్రముల నవగతము చేసికొని కాఁబోలు పశ్చిమదిశ కాషాయాంబరములు కట్టి సూర్యకమండులువు చేకొని బౌద్ధధర్మ మవలంబించెను. నాయికాహృదయ మెఱుఁగని దుష్టవటువువలె చంద్రుఁ డామెను వెంటాడవచ్చెను. ఈ విడ్డూరమును జూడవచ్చిన జనసముదాయమో యన నాకసమునఁ జుక్కలు కిటకిటలాడెను.

మారజయమువలనఁ గలిగిన శాంతిచేవలె విహారవాసు లందఱును ఒడలు మఱచి నిదురించిరి. మనీషమాత్రము మారునకు జయవెట్టుచు కల్పనాకులాయమునఁ గూరుచుండి మలయమాలిని ప్రతీక్షించుచుండెను. ఆమెభావనాపటము ద్రౌపదికోకలవలె గుట్టలు పడుచుండెను. కొంతవడి కామె లోలోపల నిటు లనుకొనెను :

"నవ్వు మన్నటు లున్న యీనడికిరేయి
నేలచివరను మేటిమున్నీటిముందు
వలపుదేవతగా బిట్టు వెలసిన నను
వింతవింతగ నెవ్వరే వెదకువారు ?"

ఆమె యిటులు ఎవరిచేతనో వెదకించుకొనుచుండఁగా అటు మారునిఁ దగులఁబెట్టిన చేయి యొకటి ఇటు మనీషపాదమును వెదకుచు ఆమెకుఁ దగిలెను. ఆమె మలయమాలియే యని భ్రమసెను. ఆమె సంతోషముతో నాపున్నమవెలుఁగున నొరగంట నా చేతిని జూచెను. క్రమక్రమముగా నాచేయి తీఁగవలె నామెశరీరమును బెనఁగొనెను.

మనీష చివాలున లేచి కూరుచుండెను. ఆచేయి యామెను గట్టిగా దాపునకు లాగుకొనెను. ఆమె మెల్లఁగా "అయ్యా, ఇది మారుని తగులఁబెట్టిన చేయియేనా ?" అని యనెను.

"నిన్నీచేయి మైత్రీమయ మయిన సృష్టియొక్క కారణభూమిలోనికిఁ గొంపోవఁగలదు" అని ఆ శ్రమణాచార్యుఁ డనెను.

"కారణభూమియా, మారణభూమియా ? చెప్పెడివి శ్రీరంగనీతులును, దూఱెడివి దొమ్మరగుడిసెలునా ?" అని మనీష అతని నొకతాపు తన్ని తన దుర్గతికి వగచుచు మలయమాలిని తలఁచుకొనుచు అచటనుండి లేచిపోయెను.

౧౨

మనీష కెచటను శాంతి దొరకలేదు. ఆమె గ్రామము విడిచి గ్రామము, నగరము విడిచి నగరము, అరణ్యము విడిచి అరణ్య

ముగా దేశ మంతయుఁ దిరిగెను. మలయమాలిసంగతి యామె కిసుమంతయుఁ దెలియలేదు.

ఆమె విసువును, విరామమును లేక మలయమాలి నన్వేషించుచు ఒక కొండ దరిని సిద్ధపురుషుల వేషములో నున్న కొంతమంది దొంగలను గనుఁగొనెను. ఆ పురుషులలో పురుషత్వ మెచటను అగపడకపోవు టామె కక్కజము కలిగించెను. అచట నొక ముసలియవ్వ యామెకు స్వాగత మిచ్చెను. మలయమాలితెరువు కనుఁగొనుట కామె వారిని సేవింపమొదలిడెను.

వారిలో నొకఁ డిటు లనెను: "మలయమాలా? వాడికి నీవు భార్యవా?"

"ఔను."

"తన్నితే పోయి పరుపుమీద పడ్డావ్."

అవ్వ యిటు లనెను: "వాడా గుహాలో దీక్షలో ఉన్నాడు."

అతఁ డిటు లనెను: "నడిరాత్రికి గాని వాడి దీక్ష కాదు."

అవ్వ యిటు లనెను: "అప్పుడు నీ వక్కడికి పోయి మాటాడుకోవచ్చును."

మనీష కాశాజ్యోతి యొక్కమాఱు ద్వాదశాదిత్యులవలె వెలిఁగెను. హిమప్రళయము వచ్చినటులు వెంటనే ఆఱిపోయెను.

"తన్నతఁడు పరిగ్రహించునా? పరిగ్రహింపకపోయిన నేమి? అతనిని గొలుచుచు ప్రేమరాజ్యములో పౌరత్వము సంపాదించుకొనవచ్చును."

ఇటు లామెభావన సముద్రములోఁబడు నదివలె ఆటుపోటులకు క్రీడారంగమాయెను.

ఒకసారి మనీష మలయమాలిని తానే చూడఁదలఁచును. ఒకసారి తా నతనికొఱకు వచ్చినటులు ఆయవ్వచేఁ జెప్పింపఁదలఁచును. తానొకసారి మలయమాలికి నమస్కరించిన పిదప తన మానమే తన భవితవ్యతను నిరూపించు నని ఇంకొకమా అనుకొనును. ఇటులనేక సంకల్ప వికల్పముల పునఃపునరావృత్తులచే చంచలమైన యామెచిత్తముముందు రాత్రి రెండవయామము ఒకసారి స్వర్గమును, ఒకసారి నరకమును కానఁబఱిచెను.

అపుడు మనీష చాటుగా నాయవ్వను బిలిచి "అవ్వా, నేను నీ కడుపునఁ బుట్టెదను. నీ వా గుహాలోనికి వెళ్లి—"

ఆ ముదియ అర్ధోక్తిలోనే అందుకొని— పిచ్చిదానా, నేనూ ఆడపుటకే పుట్టాను. నీసంగతి నా కర్థమయింది. చల్లకు వచ్చి ముంతదాచడ మెందుకు? నీకు మేలు కలుగుతుంది. ఆనందం కలుగుతుంది. కళ్లు మూసుకుని వెళ్లు సూటిగా" అనెను.

మనీష కొంచెము సందేహించి, ఎట్టకేలకు తా నొకతెయే ఆ గుహాలోనికి దారి తీసెను. అచట చిమ్మచీఁకటి. ఆమె వెనుదిరిగి చూచెను.

"ముందరికి"అని ఒక ధ్వని వినఁబడెను.

మనీష పదియడుగులు ముందరికి వైచెను. చీఁకటి అచట గోడ కట్టుకొనెను. ఆమె మరల వెనుదిరిగి చూచెను.

"ఇంకా కొంచెం ముందరికి."

ఆమె పదియడుగులు వైచి మరల వెనుదిరిగి చూచెను. ఆమెముం దొక దివ్వె వెలిఁగెను. అచట మలయమాలికి బదు లొక బలాఢ్యుఁడు నిలువఁబడి యుం

డెను. అతఁడు చల్లగా నవ్వి " ఇటు రా " అనెను.

“దయ యుంచి మలయమాలి—”

“నాకంటె వాఁడే మంత చక్కని వాఁడా? అదుగో కల్లు. కాస్త తాగిచూడు.”

తాను బోనులో పడిపోయినటు లపుడు మనీషకుఁ దెలిసెను. వెంటనే ఆ గజదొంగ చేయి మనీషకుఁ దగిలెను.

ఆమెభావనానేత్రముముందు మలయమాలి స్ఫురించెను.

ఆమె ఆఁడుపులి యాయెను.

పెద్దచేప చిన్నచేపను మ్రింగును. చిన్నమబ్బు పెద్ద చందమామ నాక్రమించును.

బలము గలవానిదే రాజ్యము. ఎవఁడీ బలమును నిర్ణయించును ?

కొంతసేపటికి చిన్న చుక్కలలో వేగుఁజుక్కయే చంద్రుఁడై ప్రకాశించెను. భూదేవియాధారచక్రమునుండి వెలుఁగు రవ్వలు పైపైకిఁ బ్రసరించుచున్నవో యన తూరుపురేకలు కానిపించి ఇంద్రుని వైజయంతపు మోసాలముందు ముగ్గులు తీర్చెను. పిట్టలు ప్రకృతిదూతలవలె దిశాంచలములకెగిరిపోఁజొచ్చెను.

ఆ దొంగలశేనిబారినుండి తప్పించుకొని వచ్చినవారిలో మనీషయే మొదటిది. అది వానికిని, ఆమెకును అక్కజము కలిగించెను.

మనీష మృత్యువుతో పన్నిదము చఱచి పరువెత్తిపరువెత్తి సముద్రముముందు నిలిచిపోయెను. ఆమెమనశ్శరీరములు రెండును అవసాదము చెందెను. ఆమె యచటి యిసుకలోఁ బడిపోయెను.

సూర్యుఁడు నడినెత్తికి వచ్చెను. అపుడామెకు చైతన్యము కలుగఁదొడఁగెను. బెస్తలు కొందఱు దవుదవ్వులలో నామెకుఁ గనఁబడిరి. “నాయుసురు తగిలి చావక యింకను మగజాతి బ్రతికియున్నదా?” అని యామె యనుకొని, ఒక్క మలయమాలి తక్కఁ దక్కిన పురుషజాతి యంతయుఁ జావవలయు నని కోరుకొనెను.

ఆమె కచట కొంత విశ్రాంతి దొరకెను. ఆమె తనసంగతి యంతయు వెనుదిరిగి చూచుకొనెను. ప్రపంచస్వభావము నవలోడించెను. తాను గణికయై సేకరించిన అనుభవముచే సంఘము చేయు నేలుబడిని తలచితలచి చూచెను. ఈప్రపంచమునందు బలమునకేకాని దౌర్బల్యమునకు తావు లేదని తలపోసెను.

వ్యక్తిగతము లగు, స్వతంత్రము లగు తలఁపు లను సెలయేఱులు బలాత్కారముగా సంఘసముద్రమునఁబడి ఉప్పబడి మునుఁగుచుఁ దేలుచు ఒడ్డుకుఁ గొట్టఁబడుచు నడిమికిఁ గొంపోఁబడుచు ఆకసమున కెగురవేయఁబడుచుఁ బాతాళమున కదుమఁగొట్టఁబడుచు నామెకుఁ గానిపించెను. స్వాతంత్ర్యముయొక్క సంకోచవికోచములు సంఘముచేతనే నిరూపింపఁబడవలయునేని వ్యక్తికి స్వాతంత్ర్యమే లేదని యామె యొక నిగమనమునకు వచ్చెను.

“ఎపుడో ఒకపుడు వ్యక్తుల యాశయములే ప్రకృతసంఘమును పరిపాలించుచో ద్వంద్వములచే నవష్టబ్ధమైన యీ చీమ

నడకపరిణామము అల్పజీవితముకల యీ వ్యక్తుల కేమి యుపకరింపఁగలదు? వ్యక్తి సంఘమునకు బలి యగుటకంటె వేఱుపాయము లేదా? చైతన్యమునందలి యిచ్ఛయొక్క గమనమునకును, ప్రకృతి యొక్క మందాతిమందగమనమునకును గల వైపరీత్యమును జూచి గణితము తెల్లఁబోవదా? ఇసీ! పాడుసృష్టి! పాడుపరిణామము! ఆనాఁటి సీతమ్మతల్లికడనుండి యీనాఁటి మనీషమ్మముండవఱకు ఆఁడు దజగరమా? దీని యవయవములమీఁద, దీని యభిరుచి మీఁద దీని కధికారము లేదా? దీని సృష్టి మీఁద దీని కధికారములేదా? ఛీ! ఆఁడుది బానిస.

"లోకమునందు తన మహిమమీఁదనే నిలువఁబడిన ఇచ్ఛాశక్తి మగవానికిని లేదు, ఆఁడుదాని కంతకన్న లేదు. అటు లోకవేళ నుండునేని అది మఱొకవ్యక్తి కనిష్ట మైనచో మరల నది నిరంకుశ మైపోవదా? కావున లోకమునందు స్వేచ్ఛయనునది, స్వాతంత్ర్య మనునది బంధిసున్న కాదా?

"నాసంగతిమాత్ర మేమంత సంగతముగా నున్నది? నన్నొకరు ప్రేమించిరి. నేనో మలయమాలిని ప్రేమించితిని. మలయమాలి యింకొకర్తిని ప్రేమించెను. ఆమె యింకొకరిని ప్రేమించును. ఇం దెవరిది తప్పు?

"ఇంకొకరి యిచ్ఛచే నిండవలసిన యీ ప్రేమకు స్వాతంత్ర్యసిద్ధి యెటులు? సృష్టికి కారణభూతమయిన మైత్రీభూమకును, ఈ ద్వంద్వములకును ఏటి మైత్రి?"

ఇటు లాలోచించియాలోచించి యామె మనస్సు తర్కమునకు వచ్చి "ఇఁక నాకు దిక్కు లేదు. దిక్కు లేనివారికి దేవుఁడే దిక్కు. ఇఁక నీలోకము మలయమాలితోఁ గూడ పురుషజాతిశూన్య మగుఁగాక! ప్రేమ దుంపనాశన మగుఁగాక" అని వాపోయెను.

ఆమెను మృత్యు వొకవంకను, మానభంగ మొకవంకను పట్టుకొని శూన్యము ముందు నిలువఁబెట్టెను. ఆమెహృదయము ఫట్టని పగిలెను. ఒక కిరణ మచట వెలిఁగెను.

౧౩

వేణువనమున విహారనిర్మాణము పరిపూర్ణ మాయెను. సున్నముచే గారచేయఁబడిన గోడ లన్నియు బుద్ధదేవుని మానసమునకు ప్రతినిధులవలె నుండెను. వేదికమీఁద నెలకొలుపఁబడిన బుద్ధుఁ డందఱకును ధ్యానముద్ర నుపదేశించుచు విహారమునెదుటఁ గల తటాకజలమునఁ బ్రతిబింబించి సాధకుల భావనాతటాకమునఁ బ్రతిబింబించిన బుద్ధుననుకరించెను.

విహారముముందు నిలువఁబడిన ప్రతివానిహృదయమును అపారము, నగాధము నగు నొకానొక తత్త్వమునఁ బ్రవేశించెను. అట్టి తత్త్వమునఁ బ్రవేశించి లోకులకు దానిఁ దెలిపిన యొక మహాపురుషుఁ డెట్టెదుటఁ గానిపించి మౌనముతో నిపు డాతత్త్వమును మరల నాదేశించుచున్నటు లుండెను.

బుద్ధునిఁ జూచిన వృద్ధుఁడొకఁడు బాలుఁ డాయెను. ఒక బాలుఁడు వృద్ధుఁ డాయెను. మధ్యమవృద్ధుఁ డొకఁడు బుద్ధునిఁ జూచుచు జందెములు పుటుక్కునఁ దెంపివయిచెను. సిగలో నలంకారముగాఁ బెట్టుకొనిన యొక నగచేతనే యొకతె తన సిగను కత్తిరించుకొనెను. శ్రమణకుఁ డొకఁడు తన వేసము

నను రోసెను. ఒక వేదసన్న్యాసి ధ్యాన ముద్ర దాల్చి మఱియొక బుద్ధప్రగ్రహమును ప్రతిష్ఠించెను.

వినోదమును జూడవచ్చిన వైదికోత్తములకు మంత్రతంత్రములును, పూజాప్రతిష్ఠలును లేని యీవిహారము బోసినోరివలె నుండెను. ఆలోచనలో మునింగి తేలుచున్న యొక వైదికోత్తముఁడు "ఇఁక ముందు కలియుగ మంతయు నిట్టి యేడూకములచేత నే నిండిపోవు నని పురాణములు లోఁగడనే మనకు చెప్పిపెట్టె" నని నవ్వెను.

యజ్ఞము చేయుటకు ధనము లేని కర్మిష్ఠి యొకఁడు "ఎటులయినను బుద్ధుని దహింసామతమునుమండీ" అనెను.

"అహింసామత మనఁగా నేమో నే నెఱుఁగను కాని కడుపునొప్పికి బుద్ధుఁడే సూకరమాంస మారగించె" నని వేదమత ప్రవక్త యొకఁ డనెను.

భక్తుఁ డగు వైదికుఁ డొకఁడు నోరు కఱచుకొని "బుద్ధదేవుఁ డొక యవతార మునుమీ" అనెను.

విహారము నాలుగుమూలలును విహరించివచ్చిన అద్వైతవాది యొకఁడు "బ్రహ్మము నంగీకరింపని బౌద్ధులకు బుద్ధుఁడే బ్రహ్మమై కూరుచున్నాఁడు." అనెను.

"అద్వైతము తెరచాటుబౌద్ధ" మని మఱియొకఁ డనెను.

"శూన్యవాది అశూన్యము నంగీకరించుచున్నాఁ" డని తార్కికుఁ డొకఁడు తల పడెను.

"కర్మమే తెలియకుండ నిటులు చేయించుచున్న" దని జరన్మీమాంసకుఁ డొకఁడు ముక్కుమీఁద వ్రేలు వేసికొనెను.

ఇటు లెవ రేమనుకొన్నను ఆ రాతి విగ్రహ మందఱను "నీ వెచటినుండి వచ్చితివి? మఱి యెచటి కేగుచుంటివి" అని నిలువఁబెట్టుచుండెను.

దూరమునుండి కోలాహల మొకటి వినఁబడఁ దొడఁగెను. క్రమక్రమముగా నది మూఁడు విరామములతో విననాయెను. కొంతవడికి

"బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి"

అను ఘోష వినఁబడెను.

దిక్కు లన్నియు నా త్రిశరణములతో ప్రతిధ్వనించెను. జను లందఱును లేచి యెదురేగఁజొచ్చిరి. బుద్ధధర్మమునందు నమ్మకము లేని అతివాదు లందఱును నిర్గమింపఁ జొచ్చిరి.

మహారాజాధిరాజ పరమేశ్వరుఁడు ఇందుకేసరియు, అతనిప్రక్క నిందుకీర్తియు, వారి ముంగల వినయజ్యోతియు పాదచారులయి వచ్చిరి. వారివెనుక మానవారణ్యము.

సాధకు లగువా రందఱును విహారమునఁ బ్రవేశించి కూరుచుండిరి. అచట సనాయి లేదు. డోలు లేదు. మేళము లేదు. తాళము లేదు. ఇంతియకాక భోగముమేళ మసలే లేదు. ధ్యానమునఁ బ్రవేశించుటయే అచట కర్తవ్యము.

సాధకు లందఱును గూరుచుండి ధ్యాన సాగరమునఁ బడిరి. ఏకాగ్రత లేని సాధకుఁ

డొకఁడు తన ప్రక్కవానినిఁ జూచి కనులు మూసికొనెను.

మఱియొకఁడు దొంగచూపులు చూచి కనులు మూసికొనియున్న యందఱి మోములను నిరాఘాటముగాఁ జూడఁ దొడఁగెను. అంతలో మఱియొకఁడుకూడ నటులనే చేయఁ దొడఁగెను. తుదకు వా రిరువురును ఒకరినొకరు చూచుకొనిరి. వారిమోములు మొదట నగవునకు నెలవులై, పిదప సిగ్గుచే చీకురించుకొని పోయెను.

ఒకఁడు తన మనోనేత్రముముం దొక శ్రమణను సాక్షాత్కారము చేసికొనెను.

ప్రక్కవా రేమనుకొందురో యని ఒక శ్రమణకుఁడు ధ్యానబాధను సహింపఁ జొచ్చెను.

విహారమును జూడవచ్చిన బాలకు లందఱును వినోద మేమియు లేకపోవుటవలన నచటి కొలఁకునఁ బడి "నీట మునిఁగి యెవ రెక్కువసే పుందురో" యని పందెము వయిచుకొనిరి. అందఱు నొక్కసారి మునిఁగిరి. ఊపిరి పట్టఁజాలని బాలకుఁ డొకఁడు ముందు లేచి నీరిపయిని దొంగతనముగా గాలి పీల్చుకొనెను. ఈ లోపుగా మఱియొకఁడు లేచెను. ఆ సవ్వడి విని మొదటివాఁడు మరల మునుక వేసెను. అందఱు నటులనే చేసి ఒడ్డెక్కిరి.

బాలశ్రమణకులు కొందఱు లేచి భిక్షకు వెడలిరి. మఱికొందఱు తమతమ పర్ణశాలలకుఁ జనిరి. ఇంకకొందఱు బుద్ధునకును, ధ్యానమునం దున్నవారికిని వందన మొనరించి వెళ్లిపోయిరి.

సాయంకాల మగువఱకు పోయినవారు పోవఁగా మిగిలినవా రయిదుగురు. వారిలో మొదట కనులు తెఱచినవాఁడు వినయజ్యోతి. వినయజ్యోతి లేచి మిగిలిన నలువుర నుద్దేశించి మోఁకారించియుండెను.

కొంతసేపటికి ఇందుకేసరి మెలకువ గనెను. అతఁడు లేచి మిగిలిన మూవుర నుద్దేశించి మోఁకారించెను.

పిదప కొంతసేపటికి ఇందుకీర్తి కనులు విప్పెను. ఆమె లేచి మిగిలిన ఆ యిరువుర ముందును మోఁకారించెను.

తరువాత మనీష జాగ్రదవస్థ చెందెను. ఆమె లేచి నిలువఁబడి ధ్యానసిద్ధుఁడును, తన్మయుఁడును నగు నొక పిన్నవానిముందు మోఁకారించెను.

అతఁడు మలయమాలి.

